
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

సోమవారం 3 నవంబరు 2025

డ్రగ్స్ కేసులో వైసీపీ విద్యార్థి విభాగం నేత

- విశాఖ జిల్లా అధ్యక్షుడిని అరెస్టు చేసిన పోలీసులు
- చరణ్ అనే యువకుడితో బెంగళూరు నుంచి ఎల్ఎస్‌డీ బోల్ట్స్ దిగుమతి
- రైల్వేస్టేషన్‌లో పట్టుకున్న పోలీసులు
- విచారణలో కొండారెడ్డి కోసం తెచ్చినట్టు వెల్లడి
- నలుగురి అరెస్టు.. మరొకరి కోసం గాలింపు



కొండారెడ్డి (ఫైల్ ఫొటో)

- వివరాలు మెయిన్‌లో

సీఐఐ సదస్సుకు పటిష్ఠ బందోబస్తు

అధికారులతో డీజీపీ సమీక్ష

- ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్ల పరిశీలన
- పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పోలీస్ బాస్



కాపులుప్పాడలోని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నమూనాను పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చి, తదితరులు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న పారిశ్రామిక పెట్టుబడిదారుల (సీఐఐ) సదస్సుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్‌కుమార్‌గుప్తా తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశంలో నిర్వహించారు. నగరంలో ఆదివారం డీజీపీ సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం ... మిగతా 6వ పేజీలో

స్టార్‌హోటళ్లలో పోలీస్‌బాస్‌ల బస

- 14 హోటళ్లతో ఒప్పందం కుదుర్చుకున్న సీపీ



హోటల్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చే పోలీస్ ఉన్నతాధికారులు బసచేసేందుకు 14 స్టార్ హోటళ్లతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదివారం ఒప్పందం చేసుకున్నారు. బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్‌లో విశాఖ హోటల్ మర్చంట్స్ అసోసియేషన్‌తో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా సమక్షంలో హోటళ్ల ప్రతినిధులు, సీపీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఏడో వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా హోం మంత్రిత్వ శాఖ ఐపీఎస్ అధికారులకు తొమ్మిది నుంచి 15 స్థాయిల మధ్య వేతనశ్రేణులు నిర్ణయించిందన్నారు. అధికారులు తమ వేతనశ్రేణి ప్రకారం లభించే టీఏ (ప్రయాణ భత్యం) నిబంధనలకు అనుగుణంగా ఒప్పందం చేసుకున్న ఈ 14 హోటళ్లలో తమకు నచ్చిన హోటల్‌లో నగదు చెల్లింపు రహితంగా బస వుండవచ్చన్నారు. నగరంలో జాతీయ, అంతర్జాతీస్థాయి సదస్సులు జరిగినప్పుడు, ప్రముఖుల పర్యటనలప్పుడు బందోబస్తు కోసం ఇక్కడకు వచ్చే ఐపీఎస్ అధికారులకు వసతి సమస్య ఏర్పడుతున్నదని, తాజాగా హోటల్స్ అసోసియేషన్‌తో కుదిరిన ఒప్పందంతో ఈ సమస్య తీరిపోతుందన్నారు.

జనవరి 28న టీ-20

- భారత్ న్యూజిలాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్
- వేదిక ఏసీఏ- వీడీసీఏ స్టేడియం



విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీ-20 మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. పోతిన మల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే ఏడాది జనవరి 28న న్యూజి భారత్, న్యూజిలాండ్ మధ్య అంతర్జాతీయ టీ20 మ్యాచ్ జరగనుంది. భారత్ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్ జట్టు మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌కు సంబంధించి జనవరి 21న తొలి టీ20 నాగపూర్, రెండో మ్యాచ్ జనవరి 23న రాయపూర్, మూడో టీ20 జనవరి 25న గువహటి, జనవరి 28న నాల్గో మ్యాచ్ విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆడనున్నారు. దీంతో ఇప్పటివరకు మూడు టెస్టు మ్యాచ్‌లు, పది వన్డే మ్యాచ్‌లు, నాలుగు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన విశాఖ త్వరలో ఐదో టీ20 మ్యాచ్ నిర్వహణకు సిద్ధమవుతోంది. ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా గత నెల మహిళల ప్రపంచకప్ టోర్నీలోని ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన విశాఖ డిసెంబరు 6న భారత్, దక్షిణాఫ్రికా మధ్య అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు సమాయత్తమవుతుండగా, జనవరి 28న భారత్, న్యూజిలాండ్ మధ్య టీ-20 మ్యాచ్ నిర్వహించనుంది.

టెన్త్, ఇంటర్ పరీక్షలకు సన్నాహాలు

- కేంద్రాల ఎంపికలో ఇబ్బందులపై అధికారుల ఆరా!

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్య, ఇంటర్ బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్, మార్చి 16 నుంచి పదో తరతగతి పరీక్షలకు ఇప్పటికే టైమ్‌టేబుల్ విడుదలైంది. ఇంటర్మీడియట్‌లో తొలిసారిగా సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందిస్తుండడంతో పరీక్షలు కూడా ఎక్కువ రోజులు జరగనున్నాయి. ఇప్పటివరకు 12 రోజుల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించేవారు. ఈ పర్యాయం సీబీఎస్ఈలో రోజుకు ఒక పరీక్ష మాత్రమే నిర్వహిస్తారు. గతంలో ఇంటర్మీడియట్‌లో ఒక రోజు సైన్స్, ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి పరీక్షలు నిర్వహించేవారు. ఉదాహరణకు గణితం, అర్థశాస్త్రం పరీక్ష ఒకే రోజు ఉండేది. సీబీఎస్ఈలో గణితం పరీక్ష నిర్వహించే రోజు మరే సబ్జెక్టు పరీక్ష ఉండదు. అందువల్ల 23 రోజులపాటు నిర్వహిస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ముగియకముందే పదోతరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. అందువల్ల కేంద్రాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇరుశాఖల అధికారులు నిర్ణయించారు. జూనియర్ కళాశాలలను ఇంటర్ పరీక్ష కేంద్రాలుగా, పాఠశాలలను పదోతరగతి పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేస్తున్నందున ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడైనా సమస్య తలెత్తే అవకాశం ఉందా అనేదానిపై ఇరు శాఖల అధికారులు సమావేశమై చర్చించారు.

తెరపైకి ఫ్రీహోల్డ్

డి.పట్టా భూములపై నేతల కన్ను

- వైసీపీ హయాంలో జిల్లాలోని 625 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ
- ఆ సమయంలోనే అనేక అవినీతి అరోపణలు
- కూటమి అధికారంలోకి వచ్చాక వాటిపై విచారణ
- ఏడాదిగా నిలిచిపోయిన ప్రక్రియ
- తాజాగా మంత్రివర్గ ఉపసంఘం గ్రీన్‌సిగ్నల్
- షరతులతో సర్టిఫికెట్ల జారీకి అనుమతి



ఆనందపురం మండలంలో ఫ్రీహోల్డ్ కోసం ఎదురుచూస్తున్న భూములు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): **వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అవినీతి ఆరోపణలకు కేంద్ర బిందువుగా నిలిచిన డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ మళ్లీ తెరపైకి ఇచ్చింది. పట్టా పొందిన రైతులు సాగు చేసుకునే భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించడంతో జిల్లాలో అటువంటి భూముల కొనుగోళ్లకు రంగం సిద్ధమవుతోంది.**

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ అనుకూల వ్యక్తులు, ఉన్నతాధికారులు విశాఖ పరిసరాల్లో భారీగా డీపట్టా భూములు కొనుగోలు చేశారు. ఈ వ్యవహారం అప్పట్లో తీవ్ర దుమారం రేపింది. అప్పటి ఉన్నతాధికారులు, వారి సన్నిహితులు, బ్రోకర్లు గ్రామాల్లో రైతులతో అనధికార ఒప్పందాలు చేసుకున్నారు. ఈ క్రమంలో పట్టా రైతులను బెదిరించి నట్టు ప్రచారం జరిగింది.

625 ఎకరాలకు...

జిల్లాలో 2023 డిసెంబరు నుంచి 2024 జనవరి వరకు సుమారు 625 ఎకరాల పట్టా భూములను వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేయగా, వాటిలో 126 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ వ్యవహారంలో జరిగిన అవినీతిపై 2024 ఏడాది జనవరి నుంచి పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు కొంత వెనక్కి తగ్గారు. ఈలోగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీపై విచారణకు ఆదేశించడంతో పాటు రిజిస్ట్రేషన్లను పూర్తిగా నిలిపివేసింది. దీంతో జిల్లా అధికారులు నగరానికి ఆనుకుని ఉన్న నాలుగు ప్రధాన మండలాల్లో ఫ్రీహోల్డ్ వ్యవహారాలపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అయితే ... మిగతా 6వ పేజీలో



సింహగిరిపై చిలుకు ద్వాదశి సందడి

సింహాచలేశుడి సన్నిధిలో ఆదివారం సాయంత్రం క్షీరాబ్ధి (చిలుకు) ద్వాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ రీతిలో అర్చకులు రోలులో నవ్వుపప్పు, బెల్లం, పాలు పోసి చెరకు గడలతో దంచారు. అనంతరం ప్రసాదాన్ని స్వామికి నివేదించారు. - వివరాలు 6లో



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఆర్కే బీచ్

కళకళలాడిన పర్యాటక ప్రాంతాలు

నగర పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి పెరిగింది. కార్తీక మాసం, ఆదివారం కావడంతో అధికసంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. జూ పార్క్, కైలాసగిరి, ఆర్కే బీచ్ కిక్కిరిసిపోయాయి. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఫీవర్ సర్వే షురూ!

- తుఫాన్ నేపథ్యంలో చేపట్టాలని ప్రభుత్వ ఆదేశం
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు
- హెల్త్ యాప్‌లో వివరాల నమోదు
- ఐదు కేసులు ఉంటే అలర్ట్
- ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు



నగరంలో ఫీవర్ సర్వే చేపడుతున్న సిబ్బంది

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తరువాత జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందుగానే జ్వరాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేలా ఆరోగ్యశాఖకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఫీవర్ సర్వేను చేపట్టింది. ఈ నెల 31 నుంచి ఆరోగ్యశాఖకు చెందిన ఆశా కార్యకర్త, ఏఎన్ఎం ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు.

సర్వేలో భాగంగా తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి జ్వరాల కు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. జ్వర లక్షణాలుంటే హెల్త్ యాప్‌లోని సిండ్రోమిక్ ఫామ్‌లో వివరాలను ఏఎన్ఎం అప్‌లోడ్ చేస్తారు. ఒకే ప్రాంతం నుంచి ఐదు జ్వరాల కేసులు నమోదైతే రాష్ట్రస్థాయి ఆరోగ్యశాఖ అధికారులకు, స్థానిక మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం అందుతుంది. ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులకు ఆదేశాలందాయి. ఆరోగ్య కేంద్రాలకు జ్వరాలతో వచ్చే రోగుల వివరాలను పీ ఫామ్, ఎల్ ఫామ్‌లో నమోదు చేస్తారు.

త్వరితగతిన గుర్తించేందుకు..

గతంలో తుపాన్లు తరువాత పలురకాల వ్యాధులు ప్రబలిన సంఘటనలున్నాయి. ఆ పరిస్థితి పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందుగానే సర్వే చేపట్టి జ్వర బాధితులను గుర్తించేందుకు సన్నద్ధమైంది. జ్వరాలు ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి జ్వరాలు వ్యాప్తి చెందకుండా కట్టడి చేయనున్నారు. సర్వేకు వచ్చే ఆరోగ్యశాఖ సిబ్బందికి ప్రజలు సహకరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమాచారాన్ని తప్పనిసరిగా వెల్లడించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో

దంపతుల మృతి

- అక్కయ్యపాలెం సంఘం ఆఫీసు వద్ద ఘటన
- ఉరి వేసుకున్న భర్త, మంచంపై భార్య మృతదేహం
- ఆమె ఏడు నెలల గర్భవతి
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు



వాసుదేవరావు, అనిత (ఫైల్ ఫొటో)

సీతంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): **అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి చెందారు. ఈ సంఘటన అక్కయ్యపాలెం సంఘం ఆఫీసు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...**



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ఉమాకాంత్

అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ వద్ద సూరిశెట్టి వాసుదేవరావు (34), తన తల్లి, భార్య అనిత (25)తో కలిసి దంపతులు నివాసం ఉంటున్నారు. వాసుదేవరావు చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. కాగా బంధువుల ఇంట శుభ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వాసుదేవరావు తల్లి ఆదివారం ఉదయం మధురవాడ వెళ్లింది. తిరిగి రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకుంది. ఎంతసేపు తలుపులు కొట్టినా ఎవరూ తీయలేదు. దీంతో రైల్వే న్యూకాలనీలో ఉన్న తన కుమార్తెకు ఫోన్ చేసి, తలుపు కొట్టినా తీయడం లేదని తెలిపింది. దీంతో వారు అక్కడికి చేరుకుని, పక్క ఇంట్లో నుంచి తమ ఇంటి కిటికీ తెరిచి ... మిగతా 6వ పేజీలో

ఇంటిపై హక్కు

వారసత్వ గృహాలకు ప్రాపర్టీ కార్డులు

- క్రయవిక్రయాలకు అవకాశం
- బ్యాంకు రుణాలు తీసుకునే వీలు
- జిల్లాలోని 22 గ్రామాల్లో 'స్వామిత్ర' సర్వేపూర్తి
- మిగిలిన గ్రామాల్లో కొనసాగుతున్న ప్రక్రియ



పద్మనాభం మండలం తునివలసలో స్వామిత్ర సర్వేచేస్తున్న పంచాయతీరాజ్, సర్వేశాఖ ఉద్యోగులు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): **గ్రామ కంఠాల్లో వారసత్వంగా వస్తున్న ఇళ్లలో నివసిస్తున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించాలన్న బృహత్తర ప్రాజెక్టు సర్వే జోరుగా సాగుతోంది. గ్రామాల్లో నివాసాలు, ప్రభుత్వ నిర్మాణాలు (పాఠశాల/అంగన్‌వాడీ/పంచాయతీ/ఇతర భవనాలు) ఉమ్మడి స్థలాలను సర్వేచేసి అధికారికంగా రికార్డుల్లో నమోదుచేయడానికి కేంద్రం ప్రారంభించిన 'స్వామిత్ర' ప్రాజెక్టును జిల్లాలో మూడు విడతలుగా చేపట్టారు. ఇప్పటివరకు 22 గ్రామాల్లో సర్వే చేయగా, మూడోవిడత మిగిలిన గ్రామాల్లో కొనసాగుతుంది.**

గ్రామాల్లో తరతరాల క్రితం నిర్మించిన ఇళ్లకు ఇప్పటివరకు పక్కా రికార్డులు లేవు. వారసత్వంగా నివాసం ఉండడమే తప్ప రెవెన్యూ రికార్డుల్లో ఎవరిపేరు ఉండదు. అధికారికంగా రిజిస్ట్రేషన్ శాఖలో క్రయ విక్రయాలకు ఆస్కారంలేదు. గ్రామం మొత్తం గ్రామ కంఠంగా పరిగణిస్తారు. సాగుభూములకు మాత్రమే రికార్డులు ఉంటాయి. గ్రామ కంఠంలో ఖాళీ స్థలాలు చాలా వరకు ఆక్రమణలకు గురికావడంతో అనేకచోట్ల వివాదాలు రేగుతున్నాయి. చివరకు కొన్ని కుటుంబాలు పాత ఇంటి స్థానంలో కొత్తగా నిర్మాణం చేపట్టి, బ్యాంకు రుణాలు కోరితే డాక్యుమెంట్లు అడుగుతున్నారు. దీంతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితంలేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గ్రామ కంఠాల్లో ఉన్న ఇళ్లు, నిర్మాణాలు, ఖాళీ స్థలాలు, గ్రామం మొత్తం ఉమ్మడి అవసరాలకు సంబంధించిన స్థలాలను గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రజలు నివసించే ఇళ్లకు యాజమాన్య ... మిగతా 6వ పేజీలో

అష్టలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కొమ్మాది,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అష్టలక్ష్మీ దేవాలయంలో కార్తీక మాసం ద్వాదశి పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపి అనంతరం 108 జంటలతో పాలాభిషేకం నిర్వహించారు. పాలను గర్భాలయంలో ఉంచి లక్ష్మీనారాయణులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్తలు సత్యనారాయణ, రమాదేవి ఏర్పాట్లు పరిశీలించారు.

5న దీపోత్సవ నిర్వహణపై సమావేశం

పద్మనాభం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దీపోత్సవ నిర్వహణపై ఈనెల 5న కుంతీమాధవస్వామి ఆలయంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పీఎల్ఎన్ రాజు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈనెల 19న జరిగే దీపోత్సవం నిర్వహణకు సంబంధించి ఈసమావేశం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు.

గిరి మెట్ల మార్గంలో రెయిలింగ్ ఏర్పాటు


కొండ మెట్ల మార్గంలో ఏర్పాటు చేస్తున్న రెయిలింగ్

పద్మనాభం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని ఘాట్ రోడ్డు నుంచి అనంత పద్మనాభుని ఆలయానికి చేరుకోవడానికి కొండ మెట్లకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఆసర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఆర్. జగదీశ్‌బాబు సుమారు రూ. 1.20 లక్షల తన సొంత వ్యయంతో దీన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అనంతుని ఆలయంలో జగదీశ్‌బాబును ఆదివారం సత్కరించి, అనంతుని ఫొటో బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, పద్దు, ఎర్నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా సుందరీకరణ పనులు


సాగర్‌నగర్ కల్వర్టు వద్ద జరుగుతున్న పనులు

సాగర్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈనెలలో జరగనున్న పారిశ్రామికవేత్తల సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానుండడంతో సాగర్‌నగర్, రుషికొండ బీచ్ రోడ్డులో సుందరీకరణ శరవేగంగా చేపడుతున్నారు. డివైడర్ మధ్యలో ఉన్న ఇనుప గ్రిల్స్‌కు రంగులతో పాటు డివైడర్లకు నలుపు, తెలుపు రంగులు వేస్తున్నారు. అలాగే కల్వర్టుల పక్కన రేకులతో బారికేడ్లు నిర్మిస్తున్నారు. బీచ్ రోడ్డులో పలుచోట్ల పడిన గోతులను పూడ్చుతున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


తుఫాన్ బాధితులకు సరుకులు అందిస్తున్న కార్పొరేటర్ హేమలత

మధురవాడ/కొమ్మాది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ అన్నారు. ఆదివారం ఆమె కళానగర్, వాంబేకాలనీ, చంద్రంపాలెంలో మత్స్యకారులకు 50 కిలోల బియ్యం, కిలో చొప్పున కంది పప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వంట నూనె అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకట్రావు, పిళ్లా రాము, పోతిన నాయుడు, నొడగల భవానీ పాల్గొన్నారు. అలాగే 5వ వార్డులోని పలు మత్స్యకార కుటుంబాలకు కార్పొరేటర్ మొల్లి హేమలత నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

తెరపైకి ఫ్రీహోల్డ్

... 5వ పేజీ తరువాయి

తాజాగా మంత్రివర్గ ఉపసంఘం భేటీలో కొన్ని షరతులతో సర్టిఫికెట్ల జారీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం విశేషం.

మరోసారి విచారించాలి

జిల్లాలో ఇప్పటివరకూ జారీచేసిన ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లపై మరోసారి అధికారులు దృష్టిసారించాలనే వాదన వినిపిస్తోంది. పెందుర్తి మండలం ఎస్.ఆర్.పురంలో 200 ఎకరాలు రైతుల ఆధీనంలోనే ఉన్నాయి. కానీ రెండేళ్ల క్రితమే అప్పటి ఉన్నతాధికారి, ఆయన తరఫు వ్యక్తి, వైసీపీ నేతలు (కొందరు ఇప్పుడు కూటమి పార్టీల్లో చేరారు) రైతుల నుంచి అనధికార ఒప్పందాలు చేసుకుని ఎకరాకు రెండు నుంచి మూడు లక్షల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చారు. ఆ భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ అయ్యేలోగా ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వంలోని కీలక అధికారి పట్టా భూములను వీఎంఆర్‌డీఏ సమీకరించి ప్రతి ఎకరాకు 900 గజాల ప్లాట్ తీసుకోవాలని ప్రతిపాదించారు. అయితే ఇది అమల్లోకి రాలేదు. అప్పటినుంచి ఎస్ఆర్.పురం పట్టా భూములపై ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. దీనిని అప్పటి విశాఖ ఆర్డీవో శ్రీలేఖ అడ్డుకున్నారని సమాచారం.

ఆనందపురం మండలంలో...

ఆనందపురం మండలం భీమన్నదొరపాలెం, పాలవలస గ్రామాల్లో పట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇవ్వగా, తర్లువాడ, శొంఠ్యాం తదితర గ్రామాల్లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. భీమన్నదొరపాలెంలో రైతుల నుంచి సుమారు 30 ఏళ్ల క్రితం కొందరు రాజకీయ నాయకులు భూములు కొనుగోలు చేశారు. వాటికి వైసీపీ హయాంలో ఫ్రీహోల్డ్ అనుమతులు వచ్చాయి. ఎస్.ఆర్.పురం, భీమన్నదొరపాలెం, శొంఠ్యాం, తదితర గ్రామాల్లో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లను జారీ చేసే విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు. తర్లువాడలో గూగుల్ సెంటర్‌కు సేకరించిన భూములకు రెండేళ్ల క్రితం రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చిన ఓ బ్రోకర్ ప్రస్తుతం లిటిగేషన్‌కు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.




భీమిలి బీచ్‌లో సందర్శకుల రద్దీ

పర్యాటకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్

రుషికొండ, భీమిలి బీచ్‌లు కిటకిట

సాగర్‌నగర్/భీమునిపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, భీమునిపట్నం బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. తుఫాన్ కారణంగా నాలుగు రోజుల పాటు అధికారులు పర్యాటక కేంద్రాలను తెరవలేదు. శుక్రవారం నుంచి సందర్శకులకు అనుమతి ఇచ్చారు. ఈమేరకు రుషికొండ, భీమిలి బీచ్‌లు నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సందర్శకులతో సందడిగా మారాయి. పర్యాటకుల్లో కొందరు సముద్ర స్నానాలు చేయగా, మరికొందరు ఇసుక తెన్నులపై ఆటలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు.


వ్యర్థాలు, తుప్పలతో నిండి ఉన్న చెరువు


చెరువులో కలుస్తున్న మురుగు నీరు

కాలుష్యం బారిన సంగివలస చెరువు

» పేరుకుపోతున్న వ్యర్థాలు
» కొన్నేళ్లుగా నిర్వహణ కరువు

తగరపువలస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సంగివలస చెరువు మురుగు నీరు, వ్యర్థాలతో కలుషితమవుతోంది. గతంలో ఈ చెరువును దివీస్ కంపెనీ దత్తత తీసుకుని చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు చెరువు గట్టును పార్కుగా అభివృద్ధి చేసింది. మొదట్లో పార్కు నిర్వహణ బాగానే ఉన్నా.. తరువాత ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం పార్కులో ఉన్న బెంచీలు శిథిలం కాగా పిల్లల ఆట వస్తువులు తుప్పు పట్టి పాడయ్యాయి. ప్రహరీ వల్ల చెరువుకు చేరాల్సిన వాడుక నీరు, మురుగు నీరు సమీపంలో ఉన్న కాలనీలో నిలిచిపోతోంది. దీంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరంతా ఒకే చోట చేరి మడుగు మాదిరి తయారైంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలడంతో పాటు విపరీతమైన దుర్వాసన వస్తోంది. చెరువులోకి వాడుక నీరు, వర్షం నీరు చేరడానికి కాలువలు కూడా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా తయారవుతోంది. చెరువులోకి నీరు చేరే విధంగా కాలువలు నిర్మించాలని చాలాకాలంగా స్థానికులు కోరుతున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా సమీపంలో ఉన్న రెండు కార్పొరేట్ కళాశాలలకు చెందిన వాడుక నీటిని చెరువులోకి విడిచి పెడుతున్నారు. దీనివల్ల చెరువు పూర్తిగా కాలుష్యం బారిన పడుతోంది. ఈ సమస్యపై స్థానికులు ఎప్పటి నుంచో అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బేపార్కు ఎదురుగా ఉన్న తీరంలో గుర్రపు డెక్క పూల సోయగాలు

ఆకట్టుకుంటున్న గుర్రపు డెక్క

సాగర్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండ తీరాల్లో గుర్రపు డెక్క పూల సోయగాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.బీచ్ రోడ్డులో ప్రయాణిస్తున్న వారిని ఈ పూలు అందాలతో కట్టిపడేస్తున్నాయి. ఒకవైపు నీలి మేఘాలను తాకినట్టు కనిపించే సముద్రం, మరోవైపు వెండిని తలపించే ఇసుక తెన్నులపై తివాచీ పరిచినట్టు గుర్రపు డెక్క పూల సోయగాలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి ఏటా శీతాకాలంలో ఈ పూలు పూస్తుంటాయి. వీటి పాదులు సముద్రం కోతకు గురికాకుండా రక్షణ కల్పించడంతో పాటు తీరానికి కొత్త శోభను తీసుకువస్తాయి. వీటి కాండాలను పలు ఔషధాల్లోనూ వినియోగిస్తారు.

ఇష్టారాజ్యంగా సచివాలయాల సిబ్బంది

సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విధి నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరు ఎప్పుడు కార్యాలయానికి వస్తున్నారో.. ఎప్పుడు బయటకు వెళ్తున్నారో తెలియడం లేదు. దీంతో సచివాలయాలకు వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంక్షేమ పథకాలు పొందాలన్నా.. ధ్రువీకరణ కావాలన్నా.. కార్యాలయాల చుట్టూ తిరగడానికే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు




గోపాలపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటికి సమీపంలో ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్‌పై తీగ విసరడంతో విద్యుదాఘాతంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కంపరపాలెం కాలనీలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.కాలనీకి చెందిన పండూరి రోహన్(9) ఆదివారం మధ్యాహ్నం తన ఇంటి మేడపై ఆడుకుంటూ ఇటీవల దీపావళి సందర్భంగా తన ఇంటికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వైర్లను సమీపంలోని హెచ్‌టీ విద్యుత్ తీగలపైకి విసిరాడు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బాలుడు గాయపడ్డాడు. వెంటనే బాలుడ్ని గోపాలపట్నంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

సింహగిరివాసుడికి ఘనంగా నిత్య కల్యాణం



సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేకవేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, మంగళ నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న పర్యవేక్షణాధికారి సునీల్

సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన లంక జయ మౌర్య సాయి రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం నగదు రూపంలో పర్యవేక్షణాధికారి పి. సునీల్‌కు ఆదివారం ఆయన అందజేశారు. అధికారులు దాతకు అంతరాలయంలో స్వామివారి దర్శనం కలిపించి శేష వస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు

యూబీఐ విజిథాన్ వాక్‌థాన్

సీతమ్మధార, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 సందర్భంగా విశాఖపట్నంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయం,రీజినల్ కార్యాలయం సిబ్బంది ఆధ్వర్యంలో విజిథాన్ వాక్‌థాన్ కార్యక్రమాన్ని ద్వారకానగర్ జోనల్ కార్యాలయం ప్రాంతంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జోనల్ హెడ్ శాలిని మెనన్, రీజినల్ హెడ్ జె.సింహాచలం, జోనల్ విజిలెన్స్ ఆఫీసర్ ఐవీ కృష్ణ నాయకత్వంలో నిర్వహించారు. సిబ్బంది, ప్రజల్లో నిజాయతీ, పారదర్శకత, నైతిక విలువల పట్ల అవగాహన కల్పించడం ఈ విజిథాన్ ప్రధాన ఉద్దేశమని జోనల్ హెడ్ శాలిని మెనన్ తెలిపారు. వృత్తిపరమైన జీవితంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలో కూడా విజిలెన్స్ ఎంత ముఖ్యమో వివరించారు. అవినీతి రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నిజాయతీ, బాధ్యతతో వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా అవినీతి వ్యతిరేకంగా పోరాడే సంకల్పాన్ని, మంచి పాలనను స్థాపించాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశామన్నారు.

ఇంటిపై హక్కు

... 5వ పేజీ తరువాయి

హక్కులు కల్పించేలా స్వామిత్ర ప్రాజెక్టు అమలుచేసింది.

జిల్లాలో 79 గ్రామ పంచాయతీల పరిధిలో 85 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిలో వి.తాళ్లవలస, కృష్ణాపురం, పద్మనాభం, ముచ్చెర్ల, నారాయణరాజుపేట అన్‌సెటిల్ గ్రామాలు. ఈ గ్రామాలను స్వామిత్ర సర్వే నుంచి తప్పించారు. నిడిగట్టు, రామయోగి అగ్రహారం జీవీఎంసీలో విలీనం చేశారు. జానకిదేవిపేటలో ఇళ్లులేవు. మిగిలిన గ్రామాల్లో తొలి విడత 20 గ్రామాల్లో సర్వే పూర్తిచేసి 7,554 ఇళ్లకు ప్రాపర్టీ కార్డులు (ఆస్తి యాజమాన్య ధ్రువీకరణ పత్రం) జారీచేశారు. రెండోవిడత 13 గ్రామాలకు గాను రెండింట సర్వే పూర్తయింది. మొత్తం 9,973 ప్రాపర్టీ కార్డులు సిద్ధంచేస్తున్నారు. మిగిలిన 44 గ్రామాల్లో సర్వేచేసిన తరువాత 53,433 ఇళ్లకు ప్రాపర్టీ కార్డులు జారీచేయనున్నారు. తొలివిడలతో సర్వేపూర్తిచేసిన 20 గ్రామాలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి గ్రామంలోని ఇళ్లు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భవనాలతోపాటు ఎవరూ క్లెయిమ్‌చేయని ప్రాపర్టీలను గుర్తించారు. డ్రోన్ సాయంతో ఆస్తుల వివరాలు సేకరించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రతి ఆస్తికి పార్శిల్ మ్యాపింగ్ చేస్తున్నారు. ప్రతి ఇంటి పొడవు, వెడల్పులను రికార్డులో నమోదుచేస్తున్నారు. ప్రాపర్టీకార్డులు జారీచేసే క్రమంలో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. స్వామిత్ర ప్రాజెక్టు ద్వారా ప్రాపర్టీకార్డులు అందుకున్న ఇళ్ల యజమానులు తమ ఆస్తులను అధికారికంగా విక్రయించుకోవచ్చునని, బ్యాంకు రుణాలు పొందడం, వారసులకు బదలాయింపు వంటి హక్కులు దఖలు పడతాయని తెలిపారు.


పూజలో పాల్గొన్న ఆడారి కుటుంబీకులు, భక్తులు

సింహగిరిపై చిలుకు ద్వాదశి సందడి

సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో క్షీరాబ్ధి (చిలుకు) ద్వాదశి ఉత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి పవళింపు సేవ అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. తొలుత షోడశోపచారాలు సమర్పించి, నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు. రోలు, రోకళ్లకు పూజలు చేసిన తరువాత రోలులో నువ్వు పప్పు, బెల్లం, పాలు వేసి చెరకు గడలతో, రోకళ్లతో దంచారు. ఆ మిశ్రమాన్ని స్వామివారికి, ఆలయంలోని ఇతర దేవతామూర్తులకు నివేదన చేసి, మంగళాశాసనం, మంగళ నీరాజనాలు సమర్పించారు. గత ఆచారం మేరకు అనకాపల్లికి చెందిన దివంగత ఆడారి నూకయ్య కుటుంబానికి చెందిన ఆడారి కిశోర్ కుమార్, జోగేంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, లింగబాబు, చంద్రశేఖర్, తదితర కుటుంబీకులు ఉత్సవానికి వినియోగించిన నువ్వు పప్పు, బెల్లం, చెరకు గడలను, పాలను సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి, ప్రజా సంబంధాల అధికారి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో ప్రముఖులు


డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు స్వామివారి చిత్రపటం బహూకరణ


స్వామివారి సన్నిధిలో డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ హరిప్రసాద్

స్వామివారిని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ విభాగం డైరెక్టర్ జనరల్ (డీఆర్‌డీఓ) డా. ఆర్‌వీ హరిప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఏఈఓ తిరుమలేశ్వరరావు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రము ఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేష వస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా,అధికారులు శాలువతో సత్కరించి జ్ఞాపికను, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

30 బస్తాల బియ్యం వితరణ

భీమునిపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్‌లో ఉన్న అయ్యప్ప ధ్యాన మందిరంలో వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానారాయణ సేవకు రిటైర్డ్ హెచ్ఎం, సాగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవనాపు అప్పలనాయుడు, ఆయన తనయుడు అవనాపు రవి 30 బస్తాల బియ్యం ఆదివారం వితరణగా అందజేశారు. ఈమేరకు ఆలయం వద్ద దాత దాత రని వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రునాయుడు, మొకర నర్సింగరావు, అయ్యప్ప ఆలయ సంఘం అధ్యక్షుడు నునరాపు కామేశ్వర మాధవ శాస్త్రి, కదిరి జగన్నాథం ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆయుర్వేద్ ఫిజిషియన్ పోస్టులకు యూపీఎస్సీ ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3,268 మందికి గాను 1,058 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఆయుర్వేద ఫిజిషియన్ పరీక్ష ఒక కేంద్రంలో నిర్వహించగా 130కిగాను 57 మంది హాజరయ్యారు.

నగరంలో వర్షం

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని పలు ప్రాంతాల్లోని ఆదివారం రాత్రి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగగా సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అనేక ప్రాంతాల్లో ఆకస్మిక వర్షం కురిసింది. రోడ్లపై, ఆరు బయట వ్యాపారాలు చేసేవారు వర్షం వల్ల ఇబ్బందులు పడ్డారు.

సీఐఐ సదస్సుకు పటిష్ఠ బందోబస్తు

... 5వ పేజీ తరువాయి

నుంచి రాత్రి వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొని బిజీగా గడిపారు. ఉదయం నగరానికి వచ్చిన ఆయన ముందుగా కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు వెళ్లి అక్కడ పోలీసులు వివిధ సందర్భాల్లో సీజ్ చేసిన పదివేల కేజీలకుపైగా గంజాయిని దహనం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి బీచ్‌రోడ్డుకు చేరుకుని రూ.రెండు కోట్ల అంచనావ్యయంతో చేపట్టదలచిన పోలీస్ మెస్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఐపీఎస్ అధికారులు నగరానికి వచ్చినపుడు వారికి అందే ప్రయాణ భత్యంతో తమకు అనుకూలమైన స్టార్‌హోటల్‌లో బస చేసేందుకు వీలుగా నగరంలోని 14 స్టార్‌హోటళ్లతో సీపీ శంఖబ్రతబాగ్చి చేసుకున్న అవగాహన ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేసి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఈనెల 14,15 తేదీల్లో జరిగే పారిశ్రామిక పెట్టుబడిదారుల సదస్సు (సీఐఐ) ఏర్పాట్లు పరిశీలించారు. అక్కడి నుంచి పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరానికి చేరుకున్నారు. నగరంలోని ఏసీపీ అంతకంటే పైస్థాయి అధికారులతో సీఐఐ సదస్సుకు బందోబస్తు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం పార్క్‌హోటల్‌కు చేరుకుని పోలీస్ అధికారులు ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నారు. సోమవారం డీజీపీ తిరిగి విజయవాడ వెళ్లనున్నారు.

అనుమానాస్పద స్థితిలో దంపతుల మృతి

... 5వ పేజీ తరువాయి

చూడగా, వాసుదేవరావు ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆ పక్కనే మంచంపై అనిత పడి ఉండడం గమనించి ఆందోళనతో వెంటనే నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంతేకాకుండా ఇంటి తలుపులకు వేసిన తాళాలు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. బెడ్‌రూమ్ తలుపులు కూడా వేసి ఉండడంతో వాటిని కూడా విరగ్గొట్టి ప్రవేశించారు. అప్పటికే వాసుదేవరావు మృతిచెందగా, అనిత స్పృహలేకుండా పడి ఉంది. ఆమె ఏడు నెలల గర్భిణి కావడంతో కడుపులో బిడ్డ బతికే అవకాశం ఉందనే భావనతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వాసుదేవరావు ఉరివేసుకుని ఉండడంతో ఆత్మహత్యగానే భావిస్తున్నారు. అయితే అనిత మంచం వద్ద పడి ఉండడం, ఆమె శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఆమె మృతి మిస్టరీగా మారింది. విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన అనితతో వాసుదేవరావు వివాహం ఏడాది కిందట జరిగింది. దంపతుల మధ్య ఎటువంటి గొడవలు లేవని బంధువులు చెబుతున్నారు. అన్యోన్యంగా ఉండేవారంటున్నారు. ఈ నేపథ్యంలో దంపతుల మృతికి కారణాలేమిటనేది తెలియరావడం లేదు. సంఘటన స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరిస్తున్నారు. నాలుగో పట్టణ సీఐ ఉమాకాంత్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. దంపతుల మృతితో మృతుడి తల్లి, సోదరితో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం కిన్నెర థియేటర్ ఎదురుగా జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని కొమ్మాది వైఎస్సార్ కాలనీకి చెందిన యువకుడు బోయన నరశింహారెడ్డి (28)కి తీవ్ర గాయాలయ్యాయి. నరసింహారెడ్డి ఆదివారంమధ్యాహ్నం కిన్నెర థియేటర్‌లో సినిమా చూసేందుకు వచ్చి, సమయం ఉండడంతో ఎదురుగా ఉన్న బార్‌లోకి వెళ్లి మద్యం సేవించాడు. తిరిగి రోడ్డు దాటుతుండగా డివైడర్‌పై నుంచి, కాలు జారి ఆ వైపుగా వెళుతున్న లారీ ట్రాలర్ వెనుక టైర్ల క్రింద పడిపోయాడు. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు 108లో కేజీహెచ్‌కు తరలించారు. ఎంవీపీ శాంతి భద్రతల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

» నాస్తిక సమాజం నాయకుడు రవి

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకులం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది మృతి చెందడం దురదృష్టకరమని భారత నాస్తిక సమాజం నాయకుడు జె.రవి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారకులైన వారిని గుర్తించి కచ్చితంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో ఇలా భక్తులు ప్రాణాలు పోయేలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. వేలాది మంది భక్తులు వచ్చినపుడు కనీస భద్రతా చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా ఉండడం బాధ్యతారాహిత్యమన్నారు. అమాయకుల మరణానికి కారకులైన వారిని శిక్షించాల్సిందేనన్నారు.

భక్తి ముసుగులో ఇలాంటి దురాగతాలకు అవకాశం కల్పించినట్టయితే, ఇది పరిపాటిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి దుశ్చర్యలను అరికట్టాలంటే కారుకులపై చర్యలు తీసుకోవాల్సిందేనని పేర్కొన్నారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం కావాలి

» ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి

» బీచ్ రోడ్డులో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



ర్యాలీలో పాల్గొన్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఏసీబీ ఉద్యోగులు

బీచ్ రోడ్డు, నవంబర్ 2, (ఆంధ్రజ్యోతి) : అవినీతి రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని అవినీతి నిరోధక శాఖ డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బీవీఎస్ఎస్ రమణమూర్తి పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ఆదివారం అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పని చేస్తే అవినీతి నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అవినీతిరహితంగా, సేవాభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలను పొందుతూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం పనికి తగిన వేతనం ఇస్తుందని, అందువల్ల పౌరులకు అందించే ఏ సేవలోనూ లాభాపేక్ష ఉండకూడదని సూచించారు. సంస్థ అయినా, కార్యాలయం అయినా లాభాపేక్ష ఆశిస్తే ఆ సంస్థ, కార్యాలయానికే చెడ్డ పేరు వస్తుందన్నారు. ఉద్యోగ ధర్మంతో పాటు బాధ్యతలు తెలుసుకొని ప్రజలకు సహాయం చేయాలన్నారు. ఉద్యోగులు సేవాభావంతో చేసే నిజాయితీ, నిబద్ధతలకు ప్రతిఫలంగా తప్పకుండా మంచి ఫలితాలు దక్కుతాయన్నారు. ధర్మాన్ని వీడి అవినీతి జోలికి పోరాదని, అవినీతితో సంపాదించే సొమ్ము కచ్చితంగా కుటుంబాన్ని ఏదో విధంగా ఇబ్బందుల్లోకి నెడుతుందన్నారు. ఉద్యోగి అవినీతికి పాల్పడుతూ దొరికితే జైలు పాలవడం, కోర్టు చుట్టూ తిరగడంతో పాటు ఉద్యోగం కోల్పోయే దుస్థితి కూడా ఎదురవుతుందన్నారు. దేశంలో ఉద్యోగులందరూ ఐకమత్యంతో ఎటువంటి అవినీతికి తావివ్వకుండా తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తే దేశం ఎంతో సుభిక్షంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచి మంచి నడవడిక, ధర్మం, పాపభీతి వంటివి నేర్పాలన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళీమాత దేవాలయం నుంచి పార్కు హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జీవీఎంసీ పీఆర్వో నాగేశ్వరరావు, అవినీతి నిరోధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర జీవితమంతా...మార్క్సిజం వైపే..

ప్రముఖ రచయిత తెలకపల్లి రవి


ఆరుద్ర శతజయంతి సభలో ప్రసంగిస్తున్న తెలకపల్లి రవి, వేదికపై ఇతర ప్రముఖులు

డాబాగార్డెన్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఆంధ్ర వంటి గొప్ప గ్రంథాన్ని రాయడం కేవలం ఆరుద్ర వంటి గొప్ప రచయితకే సాధ్యపడిందని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని ప్రముఖ రచయిత తెలకపల్లి రవి పేర్కొన్నారు. సినిమా పాటలు రాస్తూనే.. మార్క్సిజాన్ని వదల్లేదన్నారు. ఉదాహరణకు ...గాంధీ పుట్టిన దేశం..వంటి పాటనే చెప్పుకోవచ్చునన్నారు. తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టుగా ఉంటానని చెప్పడం ఆయనకు సమాజంపై ఉన్న భావాన్ని తెలియజేస్తుందన్నారు. ఆరుద్ర పాటలు.. రచనలు నిరంతరం ప్రజలను అలరిస్తూనే, ఆలోచింపజేసేవని గుర్తుచేశారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఆరుద్ర శత జయంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలకపల్లి రవి ప్రసంగించారు. ఆరుద్ర విశాఖపట్నం ఏవీఎన్ కళాశాలలో చదువుకున్న తరువాత తనకంటే వయస్సులోని 15 సంవత్సరాలు పైబడిన మహనీయులు చాగంటి సోమయాజులు, శ్రీరంగం నారాయణ, శ్రీ..శ్రీ, రోణంకి అప్పలస్వామిలతో కలిసి జీవించడం ద్వారా గొప్ప మేధావిగా నిలిచారన్నారు. తెలుగు భాషను మహనీయులు ముందుకు తీసుకెళ్లారని, అదే పంథాను నేటితరం అనుసరించాలని సూచించారు. ఈ సభకు చీకటి దివాకర్ అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, అట్టాడ అప్పలనాయుడు, కెంగార మోహన్, ఉప్పల అప్పలరాజులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా సాహితీ స్రవంతి పూర్వ సభ్యులు నూనెల శ్రీనివాసరావు, ఎంవీ రమణరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు. అనంతరం 'తిమిరాన్ని తరిమేస్తాం'..పుస్తకాన్ని వారంతా కలిసి ఆవిష్కరించారు.

జూ పార్కు శాంతిసరోవరంలో జలకళ


నిండుకుండలా కనిపిస్తున్న శాంతి సరోవరం

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో గల శాంతి సరోవరం నిండుకుండలా జలకళతో కనిపిస్తున్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శాంతి సరోవరం పూర్తిగా నిండిపోయింది. దీంతో పార్కులో ఉన్న పక్షులు. జంతువులకు నీరు అందుబాటులో ఉంది. ఈ పరిసరాల్లో పక్షులు కిలకిలరావాలు చేస్తూ సందర్శకులకు ఆహ్లాదం పంచుతున్నాయి.

వెంకన్న ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశ పూజలు


ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకన్న స్వామి ఆలయంలో మహిళల దీపారాధన

వెంకోజీపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆషాడంలో నిద్రలోకి వెళ్లి క్షీరాబ్ది ద్వాదశ (చిలుకుల ద్వాదశి) రోజున నిద్ర మేల్కొంచే విష్ణుమూర్తికి తులసి మాలతో వివాహం చేస్తే సకల పాపాలు హరించుకు పోతాయని భక్తులంతా ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, ఆదివారం ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద తులసి మొక్కకు పూజలు నిర్వహించి, దీపారాధన చేసి, అనంతరం ఆలయాలకు వెళ్లి బ్రాహ్మణులకు స్వయం పాక, దీపదానం చేశారు. అలాగే ఎంఎంటీసీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ భక్తులు ధ్వజస్తంభం వద్ద దీపారాధనను చేసి, అర్చకులకు స్వయంపాకాలను సమర్పించారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు)52, గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 34, బజ్జి పకోడి మిఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52, గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 34, బజ్జి పకోడి మిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 48, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు 32, బంగాళదుంపలు 20, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 54, దోస కాయలు 38, పోటల్స్ 58, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 52, కంద దుంప 46, ముల్లంగి 34, దేముడు చిక్కుడు 66, గోరుచిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ముడసర్లోవలో వన భోజనాల సందడి


ఉసిరిక చెట్లు కింద భోజనాలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ పార్కులో కార్తీకమాసవన భోజనాలకు భక్తులు అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా ఆదివారం తరలివచ్చారు. కార్తీక ద్వాదశి పుణ్య దినం సందర్భంగా ఉసిరిచెట్టు కింద పూజలు నిర్వహించి భోజనాలు చేస్తే మంచిది అనేది భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో పార్కులో ఉన్న ఉసిరి చెట్ల కింద పలువురు పూజలు చేసి భోజనాలు చేశారు.

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి : ప్రణవ్ గోపాల్



సిరిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శవరాజకీయాలకు వైసీపీ చిరునామాగా మారిందని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమైనదన్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహించే ఆలయంలో జరిగిన ఘటనను కూడా ప్రభుత్వానికి ఆపాదించి, వైసీపీ నాయకులు శవరాజకీయాలకు చేస్తుండటం సిగ్గుచేటన్నారు. జరిగిన ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని, అధికార యంత్రాంగంతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. బస్సు ప్రమాదం, మత సంఘర్షణలు జరిగిన సమయాల్లో కూడా వైసీపీ ఇదే రీతిన శవ రాజకీయాలు చేసిన తీరును ప్రజలంతా గమనించారని, వారి ప్రవర్తనపై ఛీదరించుకున్నారని, అయినా వారిలో మార్పు లేదన్నారు. మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వం మెరుగైన సేవలు అందించిందని ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

» కార్తీక మాసం కావడంతో మొదలైన వన భోజనాల సందడి


ఊడలు ఊగుతూ ఆటవిడుపు


పిల్లాపాపలతో జూకు చేరుకుంటున్న సందర్శకులు

ఆరిలోవ,. నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం కావడంతో ఆదివారం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు సందర్శకుల తాకిడి పెరిగింది. పలువురు వన సమారాధనల నిమిత్తం జూకు విచ్చేశారు. ఇక్కడ ఉన్న చెట్ల మధ్య ప్రశాంత, ఆహ్లాద వాతావరణంలో సేదతీరుతూ కుటుంబాలతో ఆనందంగా గడిపారు. జంతువులు, పక్షుల మోటు వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో గడిపారు. ఆదివారం 3213 మంది సందర్శకులు వచ్చినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.వీరి నుంచి జూకు రూ.2.68 లక్షల ఆదాయం సమకూర్చినట్టు ఆమె వెల్లడించారు.


సెల్ఫీ జోన్ వద్ద చిన్నారుల సందడి

తుపాను బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


ఆరిలోవ : 10వ వార్డులో బాధితులకు సరుకులు అందజేస్తున్న కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి


వెంకోజీపాలెం : 15వ వార్డులో నిత్యావసర సరుకులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆరిలోవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డుకు చెందిన మొంథా తుపాను బాధితులకు ఆదివారం ఐదు రేషన్ డిపోల వద్ద నిత్యావసరా సరుకులను కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజ శేఖర్ అందజేశారు. సుమారు 30 మంది బాధితులకు సరుకులను అందించారు. వీరిలో మత్స్యకార కుటుంబాలు, ఇతర బీసీ వర్గాలు ఉన్నాయి. వీరికి బియ్యంతో పాటు వంట నూనె, గోధుమ పిండి, ఉల్లిపాయలు, బంగాళాదంపలు అందజేశారు. కార్యక్రమంలో మద్దిల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో..

వెంకోజీపాలెం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా నిరాశ్రయులైన మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం 50 కిలోల బియ్యంతో పాటు పలు నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేసింది. జీవీఎంసీ 15వ వార్డు కొండవాలు ప్రాంతంలో నివాసముంటున్న మత్స్యకారుడు జె.కిషోర్ కుటుంబానికి ఆదివారం సింహాద్రిపురం కాలనీలోని 213 డిపోలో ఉచిత తుఫాన్ రేషన్‌ను వార్డు టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, 15వ వార్డు టీడీపీ అధ్యక్షులు మళ్ల రవికుమార్, ఉపాధ్యక్షులు బోను సూరిబాబు, యువత అధ్యక్షులు బుగత జ్ఞాన సాయిదీప్ ఇతర నాయకులు, డీలర్ ఎస్కే సుభాని, పాండు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ ఓవరాల్ చాంప్ బుల్లయ్య



ఛాంపియన్‌గా నిలిచిన బుల్లయ్య కళాశాల జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పురుషుల, మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో రెండు విభాగాల్లోనూ లంకపల్లి బుల్లయ్య కాలేజి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీలు కైవసం చేసుకుంది. రన్నరప్‌గా పురుషుల విభాగంలో మిసెస్ ఏవీఎన్ కాలేజి, మహిళల విభాగంలో సత్య డిగ్రీ కాలేజి నిలిచాయి. ఆదివారం బుల్లయ్య కాలేజిలో జరిగిన టోర్నీని కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుకుమార్ ప్రారంభించగా, ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

కాశీబుగ్గ దుర్ఘటన కలచి వేసింది

» వైసీపీ నీచ, శవ రాజకీయాలు మానుకోవాలి

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు, పాల్గొన్న బొండా జగన్, రౌతు శ్రీనివాస్, నరసింహపాత్రుడు, నేతలు సూర్యనారాయణ తదతరులు

గాజువాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ప్రాంతంలోనివేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మృతి చెందడం కలిచివేసిందని, ఇది అత్యంత దురదృష్ట సంఘటన అని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గలో జరిగిన ప్రమాదంపై వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, శవ రాజకీయాలు మానుకోవాలన్నారు. సంఘటన జరిగిన మరుక్షణమే ప్రభుత్వం అప్రమత్తమై ప్రజాప్రతినిధులు, అధికారులను సంఘటన స్థలానికి పంపించి క్షతగాత్రులకు మెరుగైన సేవలందించేందుకు విశేష కృషి చేసిందన్నారు. మృతులకుటుంబాలను రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో పాటు తాను కూడా పరామర్శించామన్నారు. ఈ ఆలయం ఒక ప్రైవేటు స్థలంలో నిర్మించిందని, ప్రభుత్వ ఆధీనంలో లేదని పేర్కొన్నారు. కానీ వైసీపీ మాత్రం సోషల్ మీడియాలో లేని పోని విధంగా విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, బొండా జగన్, రౌతు శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరు సూర్యనారాయణ, గోమాడ వాసు, రట్టి వాసు, సింగూరు అనంత్, కొండబాబు, నమ్మి సింహాద్రి, గాంధీ, అంగ కృష్ణ, రమేష్, రాష్ట్ర గ్రీనరీ బ్యూటిషియన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు పాల్గొన్నారు.

వసతిగృహం విద్యార్థులకు బస్సు పాస్‌లు పంపిణీ


వసతిగృహం విద్యార్థులతో వెలగపూడి ప్రతాప్‌రుద్ర

ఎంవీపీ కాలనీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉన్న 30 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తన సొంత నిధులతో ఆర్టీసీ బస్సు పాస్‌లను అందించారు. ఆదివారం వసతి గృహంలోని విద్యార్థులకు వెలగపూడి తనయుడు ప్రతాప్‌రుద్ర విద్యార్థులకు పాస్‌లను అందజేశారు. ఈ విద్యార్థులు పెదవాల్తేరులోని కేడీపీఎం ఉన్నత పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లే వారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనరెడ్డి, మధుకృష్ణ, సెల్వరాజ్, శివరామకృష్ణ, కామేష్, భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 7న పూర్వ విద్యార్థుల సమావేశం


ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం ఆడిటోరియంలో సమావేశమైన పూర్వ విద్యార్థుల కమిటీ

ఎంవీపీ కాలనీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఏటా భారీ స్థాయిలో నిర్వహించే కాకినాడ ఈకోసాక్ పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 7న నిర్వహించాలని విద్యార్థుల యాన్యువల్ మీట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధి కేఎస్ఎన్ రావు తెలిపారు. ఎంవీపీ కాలనీలో ఆదివారం జరిగిన సమావేశంలో కమిటీ ప్రతినిధులు ఓఆర్ఎం రావు, రమేష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల సమావేశంలో జేఎన్టీయూ కాకినాడ, విజయనగరం వైస్ చాన్సలర్లు, పూర్వ విద్యార్థులైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఎం ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగనుందని, పూర్వ విద్యార్థులందరూ పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

కాశీబుగ్గ దుర్ఘటన మృతులకు వైసీపీ నివాళి


కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసీపీ ఇతర నాయకులు

సిరిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ ఆలయాల్లో భద్రతా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు వైసీపీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

» రూ.1,01,700 స్వాధీనం

సీతంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలోని ఓ ఇంటిలో పేకాడుతున్న 12 మందిని టాస్క్‌ఫోర్సు సహాయంతో నాలుగో పట్టణ పోలీసులు ఆదివారం పట్టుకుని రూ.1,01,700 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాలుగో పట్టణ ఎస్ఐ జి.వెంకటరావు, సిటీ టాస్క్‌ఫోర్సు ఎస్ఐ జి.హరీష్‌లు తమ సిబ్బందితో కలిసి అక్కయ్యపాలెంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలోని హెచ్ఎస్ఆర్ ఎన్‌క్లేవ్‌లో ఎస్ఎఫ్2 రెండో అంతస్తులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 12 మంది పట్టుబడ్డారు. వారంతా మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, కంచరపాలెం, మురళీనగర్ ప్రాంతీయులుగా గుర్తించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించి సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆయుర్వేద్ ఫిజిషియన్ పోస్టులకు యూపీఎస్సీ ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. నగరంలోని ఏడు కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల పరీక్షకు 3,268 మందికి గాను 1,058 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఆయుర్వేద ఫిజిషియన్ పరీక్ష ఒక కేంద్రంలో నిర్వహించగా 130కి గాను 57 మంది హాజరయ్యారు.

నగరంలో వర్షం

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పలు ప్రాంతాల్లోని ఆదివారం రాత్రి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగగా సాయంత్రం ఒక్కసారిగా వాతా వరణం చల్లబడింది. అనేక ప్రాంతాల్లో ఆకస్మిక వర్షం కురిసింది. రోడ్లపై, ఆరుబయట వ్యాపారాలు చేసేవారు వర్షం వల్ల ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేక రైలుకు అదనపు కోచ్

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సంత్రాగచ్చి, యశ్వంత్‌పూర్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలుకు (02863) ఈ నెల 6న అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

వాకర్స్‌క్లబ్‌లో 'వశీకరణం' నాటక ప్రదర్శన

మాధవధార, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్ అధ్వర్యంలో మాధవధార చైతన్య కళాసాగర్ బృందం సభ్యులు వశీకరణం హాస్య నాటికను ఆదివారం ప్రదర్శించారు. స్థానికులు, క్లబ్ నిర్వాహక కమిటీ సభ్యులు నాటకాన్ని వీక్షించారు. మొబైల్ ఫోన్ మాత్రమే ప్రపంచంగా గడిపేస్తున్న నేటి తరానికి అలనాటి నాటిక, నాటకాల ప్రదర్శన పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వాకర్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు.

ఏపీటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా గొల్ల బాబూరావు



బాబూరావును అభినందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అక్కయ్యపాలెం లో రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు బాబూరావును ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

మురళీనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరుల మత పెద్ద సూఫీ మొయినుద్దీన్ చిస్తీ వర్థంతి సందర్భంగా నిర్వహించే ఉర్సు ఉత్సవాన్ని ఆదివారం 49వవార్డు బర్మాక్యాంప్‌లో ఘనంగా చేపట్టారు. బర్మాక్యాంప్ కొండమీది అలా హజరత్ మసీదు నుంచి కమిటీ ప్రెసిడెంట్ మదీనా వలి పర్యవేక్షణలో జరిగిన ఉత్సవంలో ముస్లిం సోదరులు ఖవ్వాలీ భక్తి గీతాలతో సందడిగా పాల్గొన్నారు. ప్రత్యేక నమాజుల అనంతరం పేదలు, నిరాశ్రయులకు ఆహారం, దుస్తులు అందించారు. బర్మాక్యాంప్, శ్రీనివాసనగర్, ఎల్‌బీనగర్‌ల మీదుగా వందలాదిమంది పాల్గొన్నట్లు మసీదు కమిటీ సభ్యులు తెలిపారు.

రౌడీషీటర్లపై నిరంతరం నిఘా

సీతంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని స్టేషన్ సీఐ కె.వెంకటరమణ రౌడీషీటర్లకు సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి క్షణం రౌడీషీటర్లపై పోలీసుల డేగ కన్ను ఉంటుందని, ఎవరైనా తప్పించుకోలేరని హెచ్చరించారు.

5న రాధాకృష్ణ మహోత్సవం

మహారాణిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాధాకృష్ణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు పిలుపునిచ్చారు. ఈ నెల 5న కార్తీక పౌర్ణమి రోజున సాగర తీరంలోని గోకుల్ పార్కు శ్రీ రంగపురం సముద్ర తీరాన రాధాకృష్ణుని ఆలయంలో మహోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం సంఘం సభ్యులు యాదవ ప్రముఖులకు ఆహ్వాన పత్రాలు అందిస్తూ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఏటా సాగర తీరంలో పాలు, పెరుగు యదుమేళాతో రాధాకృష్ణుల కలశ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు, అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరుద్ర జీవితమంతా...మార్క్సిజంవైపే



ఆరుద్ర శతజయంతి సభలో ప్రసంగిస్తున్న తెలకపల్లి రవి, వేదికపై ఇతర ప్రముఖులు

▸▸ ప్రముఖ రచయిత తెలకపల్లి రవి

డాబాగార్డెన్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఆంధ్ర వంటి గొప్ప గ్రంథాన్ని రాయడం కేవలం ఆరుద్ర వంటి గొప్ప రచయితకే సాధ్యపడిందని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని ప్రముఖ రచయిత తెలకపల్లి రవి పేర్కొన్నారు. సినిమా పాటలు రాస్తూనే.. మార్క్సిజాన్ని వదల్లేదన్నారు. ఉదాహరణకు ...గాంధీ పుట్టిన దేశం.. వంటి పాటనే చెప్పుకోవచ్చునన్నారు. తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టుగా ఉంటానని చెప్పడం ఆయనకు సమాజంపై ఉన్న భావాన్ని తెలియజేస్తుందన్నారు. ఆరుద్ర పాటలు.. రచనలు నిరంతరం ప్రజలను అలరిస్తూనే, ఆలోచింపజేసేవని గుర్తుచేశారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఆరుద్ర శత జయంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలకపల్లి రవి ప్రసంగించారు. ఆరుద్ర విశాఖపట్నం ఏవీఎన్ కళాశాలలో చదువుకున్న తరువాత తనకంటే వయస్సులోని 15 సంవత్సరాలు పైబడిన మహనీయులు చాగంటి సోమయాజులు, శ్రీరంగం నారాయణ, శ్రీ.శ్రీ, రోణంకి అప్పలస్వామిలతో కలిసి జీవించడం ద్వారా గొప్ప మేధావిగా నిలిచారన్నారు. తెలుగు భాషను మహనీయులు ముందుకు తీసుకెళ్లారని, అదే పంథాను నేటితరం అనుసరించాలని సూచించారు. ఈ సభకు చీకటి దివాకర్ అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, అట్టాడ అప్పలనాయుడు, కెంగార మోహన్, ఉప్పల అప్పలరాజులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా సాహితీ స్రవంతి పూర్వ సభ్యులు నూనెల శ్రీనివాసరావు, ఎంవీ రమణరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు. అనంతరం 'తిమిరాన్ని తరిమేస్తాం'.పుస్తకాన్ని వారంతా కలిసి ఆవిష్కరించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజిథాన్ వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు

సీతమ్మధార, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవేరనెస్ వీక్-2025 సందర్భంగా విశాఖపట్నంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్, రీజినల్ కార్యాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో విజిథాన్ వాక్‌థాన్ కార్యక్రమాన్ని ద్వారకానగర్ జోనల్ కార్యాలయం ప్రాంతంలో ఆదివారం నిర్వహించారు. జోనల్ హెడ్ శాలిని మెనన్, రీజినల్ హెడ్ జె.సింహాచలం, జోనల్ విజిలెన్స్ ఆఫీసర్ ఐవీ కృష్ణ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది, ప్రజల్లో నిజాయతీ, పారదర్శకత, నైతిక విలువల పట్ల అవగాహన కల్పించడం ఈ విజిథాన్ ప్రధాన ఉద్దేశమని జోనల్ హెడ్ శాలిని మెనన్ తెలిపారు. వృత్తిపరమైన జీవితంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ విజిలెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. అవినీతి రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నిజాయతీ, బాధ్యతతో వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా అవినీతి వ్యతిరేకంగా పోరాడే సంకల్పాన్ని, మంచి సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశామన్నారు.

ఒకరికి జన్మను ఇచ్చే అదృష్టం తల్లిదే



డాక్టర్ తిరుమలిని దాసరిని సత్కరిస్తున్న డాక్టర్ శిరీషారాణి

డాబాగార్డెన్స్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో ఒకరికి జన్మనిచ్చే అదృష్టం మహిళకే దక్కుతుందని, కొన్ని కారణాల వల్ల తమకు సంతానం కలగదనే అపోహ, ఆందోళనను మహిళలు విడనాడాలని మిసెస్ తెలుగు యూఎస్ఏ విజేత డాక్టర్ తిరుమలిని దాసరి పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ మెడిసీలో ఆదివారం సాయంత్రం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను విశాఖ వాసినన్నారు. 1995లో ఆంధ్ర వైద్య కళాశాలలో చదివిన విషయాన్ని గుర్తుచేశారు. డాక్టర్ శిరీషారాణి మాట్లాడుతూ పిల్లలు పుట్టడం అనేది దేవుడిచ్చిన వరమన్నారు. చిన్న చిన్న ఇబ్బందుల కారణంగా పిల్లలు పుట్టరనే భావన, ఆందోళన దంపతుల్లో ఎక్కువగా ఉందన్నారు. సంతానం లేని దంపతులకు ఇన్‌ఫెర్టిలిటీ పరీక్షలు, మహిళలకు క్యాన్సర్‌పై స్క్రీనింగ్ టెస్ట్‌ల మెడిసిలో నెల రోజులు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. తదుపరి డాక్టర్ తిరుమలినీ దాసరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో వైభవంగా ద్వాదశి ఉత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

సింహాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో క్షీరాబ్ధి (చిలుకు) ద్వాదశి ఉత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి పవళింపు సేవ అనంతరం సాయంత్రం 4.30 గంటలకు అర్చకులు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత షోడశోపచారాలు సమర్పించి, నృసింహ అష్టోత్తర శత నామావళితో పూజలు చేశారు. రోలు, రోకళ్లకు పూజలు చేసిన తరువాత రోలులో నువ్వు పప్పు, బెల్లం, పాలు వేసి తొలుత చెరకు గడలతో, అనంతరం రోకళ్లతో దంచారు. ఆ మిశ్రమాన్ని స్వామివారికి, ఆలయంలోని ఇతర దేవతామూర్తులకు నివేదన చేసి, మంగళాశాసనం, మంగళనీరాజనాలు సమర్పించిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గత ఆచారాన్ని అనుసరించి అనకాపల్లికి చెందిన దివంగత ఆడారి నూకయ్య కుటుంబానికి చెందిన ఆడారి కిశోర్‌కుమార్, జోగేంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, లింగబాబు, చంద్రశేఖర్, తదితర కుటుంబ సభ్యులు 110 మంది పాల్గొన్నారు. ఆడారి కుటుంబం ఉత్సవానికి వినియోగించిన నువ్వు పప్పు, బెల్లం, చెరకు గడలను, పాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి, ప్రజా సంబంధాల అధికారి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ హరిప్రసాద్

స్వామివారి సన్నిధిలో ప్రముఖులు

స్వామివారిని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ విభాగం డైరెక్టర్ జనరల్ (డీఆర్‌డీఓ) డా. ఆర్‌పీ హరిప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి దేవాలయ ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి జ్ఞాపికను, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ ఓవరాల్ చాంప్ బుల్లయ్య



విజేత పురుషుల జట్టుతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పురుషుల, మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో రెండు విభాగాల్లోనూ లంకపల్లి బుల్లయ్య కాలేజి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీలు కైవసం చేసుకుంది. రన్నరప్‌గా పురుషుల విభాగంలో మిసెస్ ఏవీఎన్ కాలేజి, మహిళల విభాగంలో సత్య డిగ్రీ కాలేజి నిలిచాయి. ఆదివారం బుల్లయ్య కాలేజిలో జరిగిన టోర్నీని కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుకుమార్ ప్రారంభించగా, ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు..రూ.1,01,700 స్వాధీనం

సీతంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలోని ఓ ఇంటిలో పేకాడుతున్న 12 మందిని టాస్క్‌ఫోర్సు సహాయంతో నాలుగో పట్టణ పోలీసులు ఆదివారం పట్టుకుని రూ.1,01,700 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాలుగో పట్టణ ఎస్ఐ జి.వెంకటరావు, సిటీ టాస్క్‌ఫోర్సు ఎస్ఐ జి.హరీష్‌లు తమ సిబ్బందితో కలిసి అక్కయ్యపాలెంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలోని హెచ్ఎస్ఆర్ ఎన్‌క్లేవ్‌లో ఎస్ఎఫ్2 రెండో అంతస్తులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 12 మంది పట్టుబడ్డారు. వారంతా మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, కంచరపాలెం, మురళీనగర్ ప్రాంతీయులుగా గుర్తించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించి సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

23న రాజ్యాంగ దినోత్సవ సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జై భీమ్ సేన వార్ ప్రతినిధులు

సీతమ్మధార, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 23న రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేద్కర్ భవన్‌లో భీమ్‌సేన్ వార్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు భీమ్‌సేన్ వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ తెలిపారు. అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ఆరోగ్య రాజ్, కేబీఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇటీవల కన్నుమూసిన ప్రముఖ అంబేద్కర్ వాది సి.పవన్‌మూర్తి, బహుజన గాయకుడు ఉదయ భాస్కర్ సతీమణి లక్ష్మిలకు సంతాపం తెలిపారు. డాక్టర్ ఆరోగ్య రాజ్ మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు సమాన హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. ఉద్యమనేత కేబీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఇప్పటికీ దళిత, బహుజన సామాజిక వర్గాలపై అణచివేత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమ్‌సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు, పివిటి కాళీ గణపతిరావు, దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు జి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ రవికుమార్, రాంబాబు, విజయానంద్, ఇంటి గురుమూర్తి, చింతాడ సూర్యం, పాకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌కు బిగ్ స్ర్కీన్



వైశాఖీస్పోర్ట్సు పార్కులో బిగ్ స్ర్కీన్ వద్ద సభ్యుల సందడి

మురళీనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముంబైలో ఆదివారం రాత్రి భారత్-సౌతాఫ్రికాల మధ్య జరిగిన ఐసీసీ ఉమెన్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కు వద్ద ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. మురళీనగర్ వాసులు, వైశాఖీస్పోర్ట్సు పార్కు కమిటీ సభ్యులు కలిసి బిగ్ స్ర్కీన్ ఏర్పాటు చేసి మ్యాచ్‌ను తిలకించారు. భారత మహిళల బ్యాటింగ్‌ను, తుదిపోరులో కప్‌ను సొంతం చేసుకోవడంతో సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ సూచనలు, నగర ఎంపీ శ్రీభరత్ ప్రోద్బలంతో మహిళల క్రికెట్ మ్యాచ్ వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, కార్యదర్శి పివిఎస్.రాజు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం: కవిత



సరుకులు అందజేస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

మురళీనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల వేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పేదలకు అండగా సేవలందిస్తున్నట్లు జీవీఎంసీ 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత పేర్కొన్నారు. వాతావరణ మార్పులతో హఠాత్తుగా ఏర్పడే ప్రమాదాలు, విపత్తుల నుంచి రక్షణ కల్పించడం తమ విధిగా నాయకులు ముందడుగేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆమె బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్ రేషన్ డిపోలో మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన వారికి కేటాయించే ప్రత్యేక సాయాన్ని అందజేశారు. 50 కిలోల బియ్యం, వంట నూనె, పంచదార, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు, కందిపప్పు అర్హులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాన్ నష్టం నుంచి ప్రజల్ని గట్టెక్కించే చర్యల్లో భాగంగానే పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ విభాగం సమన్వయంతో సరుకుల్ని సకాలంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నీటితో సమాధుల పండుగ



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు

జ్ఞానాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన తమ కుటుంబ సభ్యుల ఆత్మలకు శాంతి కలగాలని ఆదివారం జ్ఞానాపురంలోని పునీతపేతురు ప్రధాన ఆలయంలోని శ్మశానవాటికలో పరిశుద్ధ ఆత్మల దైవిక పూజ జరిపారు. విశ్వాసులందరూ పునీత పేతురు ప్రధాన దేవాలయం నుంచి శ్మశానవాటిక వరకు వెళ్లి సమాధుల వద్ద ప్రార్థనలు జరిపారు. మరణించిన వారి తప్పులు క్షమించాలని , దేవుని రాజ్యంలోకి ప్రవేశించేలా వారి ఆత్మలను రోజువారి ప్రార్థనలలో గుర్తుంచుకోవాలని విశాఖపట్నం ఆర్చిపీఠాధిపతి ఉడుముల బాల అన్నారు. ఆలయ విచారణకర్త ఫాదర్ జొన్నాడ ప్రకాష్, సహాయ విచారణకర్తలు ఫాదర్ ప్రేమ్‌కుమార్, ఫాదర్ థామస్, ఇతర ఫాదర్లు ప్రతిసమాధి వద్ద ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ విశ్వాసులు మరణించిన వారి కుటుంబ సభ్యులు సమాధులను పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కొల్లూర్ మాన్షన్ పరిసరాల్లో అంధకారం



చీకటిలో కొల్లూరుమాన్షన్ ప్రాంతం

మహారాణిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ జంక్షన్ సమీప ప్రాంతాలు అంధకారంలో ఉన్నాయి. మహారాణిపేటలోని 29, 30 వార్డుల పరిధిలో అంగటి దిబ్బ ప్రాంతం నుంచి జిల్లా పరిషత్ జంక్షన్‌కు, రెడ్‌క్రాస్ భవన్ రహదారి కొల్లూర్ మాన్షన్ రహదారిలో వీధి దీపాలు వెలగక అంధకారంలో ఉన్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైట్లు బాగానే ఉన్నా, కనెక్షన్‌లు లూజ్ కాంటాక్ట్ ఉన్నందున లైట్లు వెలుగుతాయో? వెలగవో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ రోడ్డులో ప్రభుత్వ కార్యాలయాలు తప్ప, సాధారణ జనసంచారం తక్కువగా ఉంటుంది. లైట్లు లేకపోవటంతో మందుబాబులు, ఆకతాయిలు ఎక్కువగా సంచరిస్తున్నారు. గతంలో అనేక దుస్సంఘటనలు జరిగాయి. దీనితో పోలీసు గస్తీని పెంచారు. నేడు అర్ధరాత్రి వరకు నిర్మానుష్యంగా ఉన్నా, ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మందుబాబులు ఉనికి చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఆ పరిసరాలు చీకటిగా ఉండటంతో మళ్లీ అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. లైట్లు వెలిగేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో దంపతుల మృతి

... 5వ పేజీ తరువాయి

చూడగా, వాసుదేవరావు ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆ పక్కనే మంచంపై అనిత పడి ఉండడం గమనించి ఆందోళనతో వెంటనే నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంతేకాకుండా ఇంటి తలుపులకు వేసిన తాళాలు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. బెడ్‌రూమ్ తలుపులు కూడా వేసి ఉండడంతో వాటిని కూడా విరగ్గొట్టి ప్రవేశించారు. అప్పటికే వాసుదేవరావు మృతిచెందగా, అనిత స్పృహలేకుండా పడి ఉంది. ఆమె ఏడు నెలల గర్భిణి కావడంతో కడుపులో బిడ్డ బతికే అవకాశం ఉందనే భావనతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

వాసుదేవరావు ఉరివేసుకుని ఉండడంతో ఆత్మహత్యగానే భావిస్తున్నారు. అయితే అనిత మంచం వద్ద పడి ఉండడం, ఆమె శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఆమె మృతి మిస్టరీగా మారింది. విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన అనితతో వాసుదేవరావు వివాహం ఏడాది కిందట జరిగింది. దంపతుల మధ్య ఎటువంటి గొడవలు లేవని బంధువులు చెబుతున్నారు. అన్యోన్యంగా ఉండేవారంటున్నారు. ఈ నేపథ్యంలో దంపతుల మృతికి కారణాలేమిటనేది తెలియరావడం లేదు. సంఘటన స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరిస్తున్నారు. నాలుగో పట్టణ సీఐ ఉమాకాంత్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. దంపతుల మృతితో మృతుడి తల్లి, సోదరితో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సీఐఐ సదస్సుకు పటిష్ఠ బందోబస్తు

... 5వ పేజీ తరువాయి

నుంచి రాత్రి వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొని బిజీగా గడిపారు. ఉదయం నగరానికి వచ్చిన ఆయన ముందుగా కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు వెళ్లి అక్కడ పోలీసులు వివిధ సందర్భాల్లో సీజ్ చేసిన పదివేల కేజీలకుపైగా గంజాయిని దహనం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి బీచ్‌రోడ్డుకు చేరుకుని రూ.రెండు కోట్ల అంచనావ్యయంతో చేపట్టదలచిన పోలీస్ మెస్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఐపీఎస్ అధికారులు నగరానికి వచ్చినపుడు వారికి అందే ప్రయాణ భత్యంతో తమకు అనుకూలమైన స్టార్‌హోటల్‌లో బస చేసేందుకు వీలుగా నగరంలోని 14 స్టార్‌హోటళ్లతో సీపీ శంఖబ్రతబాగ్చి చేసుకున్న అవగాహన ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేసి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఈనెల 14,15 తేదీల్లో జరిగే పారిశ్రామిక పెట్టుబడిదారుల సదస్సు (సీఐఐ) ఏర్పాట్లు పరిశీలించారు. అక్కడి నుంచి పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరానికి చేరుకున్నారు. నగరంలోని ఏసీపీ అంతకంటే పైస్థాయి అధికారులతో సీఐఐ సదస్సుకు బందోబస్తు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం పార్క్‌హోటల్‌కు చేరుకుని పోలీస్ అధికారులు ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నారు. సోమవారం డీజీపీ తిరిగి విజయవాడ వెళ్లనున్నారు.

ఇంటిపై హక్కు

... 5వ పేజీ తరువాయి

హక్కులు కల్పించేలా స్వామిత్ర ప్రాజెక్టు అమలుచేసింది.

జిల్లాలో 79 గ్రామ పంచాయతీల పరిధిలో 85 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిలో వి.తాళ్లవలస, కృష్ణాపురం, పద్మనాభం, ముచ్చెర్ల, నారాయణరాజుపేట అన్‌సెటిల్ గ్రామాలు. ఈ గ్రామాలను స్వామిత్ర సర్వే నుంచి తప్పించారు. నిడిగట్టు, రామయోగి అగ్రహారం జీవీఎంసీలో విలీనం చేశారు. జానకిదేవిపేటలో ఇళ్లులేవు. మిగిలిన గ్రామాల్లో తొలి విడత 20 గ్రామాల్లో సర్వే పూర్తిచేసి 7,554 ఇళ్లకు ప్రాపర్టీ కార్డులు (ఆస్తి యాజమాన్య ధ్రువీకరణ పత్రం) జారీచేశారు. రెండోవిడత 13 గ్రామాలకు గాను రెండింట సర్వే పూర్తయింది. మొత్తం 9,973 ప్రాపర్టీ కార్డులు సిద్ధంచేస్తున్నారు. మిగిలిన 44 గ్రామాల్లో సర్వేచేసిన తరువాత 53,433 ఇళ్లకు ప్రాపర్టీ కార్డులు జారీచేయనున్నారు. తొలివిడలతో సర్వేపూర్తిచేసిన 20 గ్రామాలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి గ్రామంలోని ఇళ్ల, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భవనాలతో పాటు ఎవరూ క్లైమ్‌చేయని ప్రాపర్టీలను గుర్తించారు. డ్రోన్ సాయంతో ఆస్తుల వివరాలు సేకరించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రతి ఆస్తికి పార్సిల్ మ్యాపింగ్ చేస్తున్నారు. ప్రతి ఇంటి పొడవు, వెడల్పులను రికార్డులో నమోదుచేస్తున్నారు. ప్రాపర్టీకార్డులు జారీచేసే క్రమంలో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. స్వామిత్ర ప్రాజెక్టు ద్వారా ప్రాపర్టీకార్డులు అందుకున్న ఇళ్ల యజమానులు తమ ఆస్తులను అధికారికంగా విక్రయించుకోవచ్చునని, బ్యాంకు రుణాలు పొందడం, వారసులకు బదలాయింపు వంటి హక్కులు దఖలు పడతాయని తెలిపారు.

తెరపైకి ఫ్రీహోల్డ్

... 5వ పేజీ తరువాయి

తాజాగా మంత్రివర్గ ఉపసంఘం భేటీలో కొన్ని షరతులతో సర్టిఫికెట్ల జారీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం విశేషం.

మరోసారి విచారించాలి

జిల్లాలో ఇప్పటివరకూ జారీచేసిన ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లపై మరోసారి అధికారులు దృష్టిసారించాలనే వాదన వినిపిస్తోంది. పెందుర్తి మండలం ఎస్.ఆర్.పురంలో సుమారు 200 ఎకరాలు రైతుల ఆధీనంలోనే ఉన్నాయి. కానీ రెండేళ్ల క్రితమే అప్పటి ఉన్నతాధికారి, ఆయన తరపు వ్యక్తి, వైసీపీ నేతలు (కొందరు ఇప్పుడు కూటమి పార్టీల్లో చేరారు) రైతుల నుంచి అనధికార ఒప్పందాలు చేసుకుని ఎకరాకు రెండు నుంచి మూడు లక్షల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చారు. ఆ భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ అయ్యేలోగా ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వంలోని కీలక అధికారి పట్టా భూములను వీఎంఆర్‌డీఏ సమీకరించి ప్రతి ఎకరాకు 900 గజాల ప్లాట్ తీసుకోవాలని ప్రతిపాదించారు. అయితే ఇది అమల్లోకి రాలేదు. అప్పటినుంచి ఎస్ఆర్.పురం పట్టా భూములపై ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. దీనిని అప్పటి విశాఖ ఆర్డీవో శ్రీలేఖ అడ్డుకున్నారని సమాచారం.

ఆనందపురం మండలంలో...

ఆనందపురం మండలం భీమన్నదొరపాలెం, పాలవలస గ్రామాల్లో పట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇవ్వగా, తర్లువాడ, శొంఠ్యాం తదితర గ్రామాల్లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. భీమన్నదొరపాలెంలో రైతుల నుంచి సుమారు 30 ఏళ్ల క్రితం కొందరు రాజకీయ నాయకులు భూములు కొనుగోలు చేశారు. వాటికి వైసీపీ హయాంలో ఫ్రీహోల్డ్ అనుమతులు వచ్చాయి. ఎస్.ఆర్.పురం, భీమన్నదొరపాలెం, శొంఠ్యాం, తదితర గ్రామాల్లో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లను జారీ చేసే విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు. తర్లువాడలో గూగుల్ సెంటర్‌కు సేకరించిన భూములకు రెండేళ్ల క్రితం రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చిన ఓ బ్రోకర్ ప్రస్తుతం లిటిగేషన్‌కు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈవీలతో స్టీల్‌ప్లాంటులో ప్రవేశాలకు అనుమతి తప్పనిసరి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులోకి ఎలక్ట్రికల్ వాహనాల్లో వెళ్లేవారు అనుమతి తీసుకోవాలని ఉక్కు యాజమాన్యం పేర్కొంది. ఉద్యోగులు, సంస్థ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయాన్ని యాజమాన్యం తీసుకున్నట్టు సమాచారం.ఇటీవల స్టీల్‌ప్లాంటులోకి వెళ్లే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు భారీగా ఎలక్ట్రికల్ వాహనాల్లో ఎక్కువగా వెళ్తున్నారు.

నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ అప్పన్న కాలనీ సగర సంక్షేమ సంఘం, రామాలయం సేవా సంఘం కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా గుర్రం పెద్ద గోవింద్, అధ్యక్షుడిగా గుర్రం పెద్ద సింహాచలం, కార్యదర్శిగా గుర్రం రాజు, కన్వీనర్‌లుగా గండికోట తాతారావు, గుర్రం చిన్న సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పిండి గోవిందరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రాంబాబు, అలాగే రామాలయ కమిటీ గౌరవాధ్యక్షుడిగా పిండి అప్పలరాజు, అధ్యక్షులుగా గుర్రం నాగరాజు, కార్యదర్శిగా నక్క వరవెంకటరావు, కన్వీనర్లుగా గుర్రం త్రినాథ్, ఆర్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

16న అయ్యప్ప అంబలం పూజ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 16న భారీ స్థాయిలో అంబలం పూజ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ కార్యదర్శి కేఎస్ఎన్ రావు తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా శబరిమల సన్నిధానంలో నిర్వహించే విధంగానే ఇక్కడ కూడా పూజలు చేస్తామన్నారు. ఇరుముడి ధరించిన భక్తులకు స్వామివారి 18 మెట్ల ద్వారా దర్శన భాగ్యం కలుగుతుందని తెలిపారు. అలాగే మాలధారణ భక్తులకు వచ్చే నెల 1 వరకు మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేత జీవన్‌కుమార్‌కు సత్కారం



జీవన్‌కుమార్‌కు సత్కరిస్తున్న యువకులు

అగనంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనంతపురంలో నిర్వహించిన జూనియర్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అగనంపూడికి చెందిన జీవన్‌కుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈసందర్భంగా ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు జీవన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డొక్కా రమేశ్, బి.సత్యనారాయణ, విందుల రాజు, గుర్రం నూకరాజు, హరికృష్ణ, జి.నూకరాజు, రాంబాబు, జగన్నాథం, చరణ్‌సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ దుర్ఘటన కలచి వేసింది

» వైసీపీ నీచ, శవ రాజకీయాలు మానుకోవాలి
» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు, పాల్గొన్న బొండా జగన్, రౌతు శ్రీనివాస్, నరసింహపాత్రుడు, నేతలు సూర్యనారాయణ తదితరులు

గాజువాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ప్రాంతంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మృతి చెందడం కలిచివేసిందని, ఇది అత్యంత దురదుష్ట సంఘటన అని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గలో జరిగిన ప్రమాదంపై వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, శవ రాజకీయాలు మానుకోవాలన్నారు. సంఘటన జరిగిన మరుక్షణమే ప్రభుత్వం అప్రమత్తమై ప్రజాప్రతినిధులు, అధికారులను సంఘటన స్థలానికి పంపించి క్షతగాత్రులకు మెరుగైన సేవలందించేందుకు విశేష కృషి చేసిందన్నారు. మృతులకుటుంబాలను రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో పాటు తాను కూడా పరామర్శించామన్నారు. ఈ ఆలయం ఒక ప్రైవేటు స్థలంలో నిర్మించిందని, ప్రభుత్వ ఆధీనంలో లేదని పేర్కొన్నారు. కానీ వైసీపీ మాత్రం సోషల్ మీడియాలో లేని పోని విధంగా విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, బొండా జగన్, రౌతు శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరు సూర్యనారాయణ, గోమాడ వాసు, రట్టి వాసు, సింగూరు అనంత్, కొండబాబు, నమ్మి సింహాద్రి, గాంధీ, అంగ కృష్ణ, రమేష్, రాష్ట్ర గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు పాల్గొన్నారు.

కళాకారులు సమాజహితం కోసం పాటుపడాలి

» స్టీల్‌ప్లాంటు జీఎం, స్టీల్ క్లబ్ అధ్యక్షుడు ఎం.మధుసూదన్‌రావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం మధుసూధన్‌రావు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కళాకారులు తమ కళల ద్వారా సమాజహితం కోసం పాటుపడాలని స్టీల్‌ప్లాంటు జీఎం, స్టీల్ క్లబ్ అధ్యక్షుడు ఎం.మధుసూదన్ రావు పేర్కొన్నారు. స్టీల్ క్లబ్, వైఆర్కే మ్యూజికల్ కాన్సెప్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పాటల పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు వేదికగా నిలిచే స్టీల్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా నిత్యం పని ఒత్తిడిలో ఉన్న ఉద్యోగులకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 31మంది పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సీహెచ్ అప్పారావు, కె.దుర్గాప్రసాద్, రాజ్‌కుమార్‌లు గెల్చుకున్నారు. విజేతలకు క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ వై.రవికుమార్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డి.వేణుగోపాల్, కె.రంగనాధం, బీవీ.రమణ, జె.రమేష్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

యువజనం సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలో చేపట్టనున్న యువజన సంఘం భవన నిర్మాణ పనులకు కార్పొరేటర్ గల్లా పోలీపల్లీ (చిన్నా) ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు సహకారంతో వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. అగురు యువజన సంఘం కార్యకలాపాల కోసం రూ.24 లక్షలతో భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు జెర్రి పోతుల నర్సింగరావు, కార్యదర్శి గుడేల కృష్ణ, పుక్కళ్ల కృష్ణ, పొలై రాజు, బాబూరావు,స్థానిక యువత పాల్గొన్నారు.

రామాలయంలో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

ఆటోనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకొని జీవీఎంసీ 86వ వార్డు కణితి రామాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావళితో అర్చనలు, పూజలు చేశారు. సుప్రభాతం, తోమాల సేవ, మేల్కొలుపు సేవలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలలో పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రసాదాలను పంపిణీ చేసారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరకుల పంపిణీ

అగనంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పిల్లా శ్రీనివాస్ ఆర్థికసాయంతో ఆదివారం పలు పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరావు, పట్టా రామఅప్పారావు, మరా మస్తాన్‌రెడ్డి, హనుమంతురావు, బొండా ఈశ్వరరావు, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితుల ఇళ్ల స్థలాల కోసం కృషి

» కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీఐఐసీ నిర్వాసితులు తమ ఇళ్ల స్థలాల సాధన కోసం ఐక్యంగా ప్రయత్నించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాంలో ఆదివారం జరిగిన ఏపీఐఐసీ నిర్వాసితుల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడులూ ఇళ్లు, భూములు కోల్పోయిన ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి అప్పలరెడ్డి, నరవ సింహాచలం, పెట్టి అర్జునరావు, కొల్లి పెంటయ్య, బల్లంకి అప్పారావు, పట్నాల ప్రసాద్, పి.సుబ్రమణ్యం, పాలవలస మణిబాబు, లక్ష్మణరావు, బాబురావు పాల్గొన్నారు.

భాగస్వామ్య సదస్సు జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఏపీఐఐసీ, ఐలా ప్రతినిధులు

కూర్మన్నపాలెం,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలో ఈ నెల 13, 14లో జరిగే భాగస్వామ్య సదస్సును పారిశ్రామికవేత్తలంతా విజయవంతం చేయాలని ఏపీఐఐసీ సీఈ మణిభాస్కర్ పిలుపునిచ్చారు. ఆటోనగర్ ఐలా కార్యాలయంలో నిర్వహించిన ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్ షిప్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఐలా, ఏపీఐఐసీ అధికారులతో కలసి ఆటోనగర్‌ను పర్యటించారు. పలు ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీజెడ్ఎం హరిహరరావు, ఏజెడ్ఎం లోహిత్, ఐలా కమిషనర్ ఎ.కిషోర్, ఇన్‌చార్జి ఐలా చైర్మన్ కొల్లి ఈశ్వరరావు,ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ, పలువురు పారిశ్రామికవేత్తలు, ఐలా మేనేజర్లు రాంబాబు, అంబిక, సిబ్బంది ఒమ్మి నాయుడు, చిరంజీవి, శ్రీనివాస్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యూటీ విషయంలో ఉక్కు యాజమాన్యం చొరవ చూపాలి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనుమతించిన విధంగా రూ.25 లక్షల గ్రాట్యూటీపై ఉక్కు యాజమాన్యం తగిన నిర్ణయం తీసుకోవాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ కోరారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రాట్యూటీ సీలింగ్‌ను రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సెయిల్ సంస్థ గ్రాట్యూటీ అంశాన్ని అమలు చేస్తామని ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చిందని, ఈ క్రమంలో ఉక్కు యాజమాన్యం అమలు చేయాలని కోరారు. ఉక్కు ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, నాయకులు రాజు, నాయుడు, దేముడు, అప్పారావు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగికి స్వాగతం

» సైనిక సేవలను కొనియాడుతూ సత్కారం



పెంటారావు దంపతులను ఊరేగిస్తున్న యువకులు

అగనంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఆర్మీలో 17 ఏళ్ల పాటు సేవలు అందించి, ఉద్యోగ విరమణ పొందిన బంధం పెంటారావుకు స్వగ్రామం పినమడకలో ఆదివారం ఘనస్వాగతం లభించింది. గ్రామానికి చెందిన యువకులంతా జాతీయ జెండాలను పట్టుకొని ఓపెన్ టాప్ జీపులో పెంటారావు దంపతులతో పాటు వారి తల్లిదండ్రులను ఊరేగించారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. పెంటారావు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక యువకులు కరణం పెంటారావు, బంధం ధనబాబు, బోయన్న, సింహాద్రి అండిబోయిన మూర్తి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు



కాలిన గాయాలతో పండూరి రోహన్

గోపాలపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటికి సమీపంలో ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్‌పై తీగ విసరడంతో విద్యుదాఘాతంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కంపరపాలెం కాలనీలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన పండూరి రోహన్(9) ఆదివారం మధ్యాహ్నం తన ఇంటి మేడపై ఆడుకుంటూ ఇటీవల దీపావళి సందర్భంగా తన ఇంటికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వైర్లను సమీపంలోని హెచ్‌టీ విద్యుత్ తీగలపైకి విసిరాడు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బాలుడు గాయపడ్డాడు. వెంటనే బాలుడ్ని గోపాలపట్నంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం కేటాయించిన నిత్యావసర సరుకులను కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఇంత త్వరగా సరుకులు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ.లక్ష్మి, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యునైటెడ్ చర్చికి నూతన కార్యవర్గం

మల్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం యునైటెడ్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.సువర్ణరాజు, కార్యదర్శిగా టి.జానేష్, కోశాధికారిగా విడి జాషువా, ఉపాధ్యక్షుడిగా వైసీమార్టిన్, జాయింట్ సెక్రటరీగా డి.జాన్, జాయింట్ ట్రెజరర్‌గా వై.సాల్మన్ రాజు, పలువురు కార్యవర్గ ప్రతినిధులు నియమితులయ్యారు. ఈ కమిటీ రెండేళ్లపాటు ఉంటుందని అధ్యక్షుడు సువర్ణరాజు తెలిపారు.

సినిమా గైడ్

- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **బైసన్** : శారదా,
- **తమ్మ** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), ,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52, గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 34, బజ్జి పకోడి మిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 48, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు32, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 54, దోస కాయలు 38, పోటల్స్ 58, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద52, కందదుంప 46, ముల్లంగి 34, గోరు చిక్కుడు 46, కూర పెం డలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట)5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4,

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

సరిపల్లిలో భారీ ఎత్తున ద్వాదశి అన్నసమారాధన



సరిపల్లి శివాలయంలో స్వయంభు శివలింగానికి ఎమ్మెల్యే పంచకర్ల పూజలు

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సరిపల్లిలో ఉన్న స్వయంభు శివాలయంలో కార్తీక శుద్ధ (క్షీరాబ్ధి) ద్వాదశి సందర్భంగా ఆదివారం భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి అభిముఖంగా ఉన్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్దకు పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన సుమారు ఎనిమిది వేల మంది భక్తులు శివయ్య అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆలయాన్ని సందర్శించి గర్భగుడిలో శివలింగాన్ని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఎమ్మెల్యే పంచకర్లకు ఆలయ వర్గాలు సంప్రదాయ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి క్షీరాబ్ధి పూజలు నిర్వహించారు. సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథం, ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. చినముషిడివాడ సప్తగిరినగర్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో ద్వాదశి పూజలు నిర్వహించారు. వెంకటాద్రిపై కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టి సుప్రభాత, తోమాల సేవలు, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

చలపతిరావుకు స్మృతి పురస్కార్



మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న సుంకర చలపతిరావు

మల్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బాలోత్సాన్ భవన్‌లో ఆదివారం 'మన సంస్కృతి' పేరుతో ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ సంస్థ నిర్వహించిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సుంకర చలపతిరావుకు చింతా నారప్ప స్మృతి పురస్కార్ దక్కింది. చిత్రకళా రంగంలో చలపతిరావు అందించిన సేవలకు గుర్తింపుగా దీన్ని ప్రదానం చేశారు. మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ ఈ అవార్డును చలపతిరావుకు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిల్డ్ అధ్యక్షుడు డాక్టర్ బీపీ రెడ్డి, కార్యదర్శి ఎస్‌వీపీఎస్ లక్ష్మి, కన్వీనర్ రమేష్, కోశాధికారి ఆర్.సుభాష్‌బాబు, చిత్రకారులు, అభిమానులు పాల్గొన్నారు.

సమాధుల పండగ



మల్కాపురంలో క్రైస్తవుల ప్రార్థనలు

మల్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం శ్మశానవాటికలో రోమన్ కేథలిక్ క్రైస్తవులు సుమారు వందమంది ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ జీవన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం మల్కాపురం శ్మశాన వాటికలో సమాధుల పండగ నిర్వహించారు. అక్కడ ప్రార్థనలు చేసి పూలు పెట్టారు. ఏటా ఈ కార్యక్రమం చేపడతామని తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం విడనాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గోపాలపట్నం కళాసేవాపీఠం సభ్యులు

గోపాలపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం విడనాడాలని కోరుతూ గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు ప్రధాన రహదారిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి కలిగే ముప్పుతో పాటు జీవమనుగడకు కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర వస్తువుల్ని వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళా సేవాపీఠం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే వనసేన ధ్యేయం

మల్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో నిత్యం ముందుండే వనసేన బృందం ఆదివారం జింక్ శివాలయం ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించిందని 59వ వార్డు జనసేన అధ్యక్షుడు ముప్పిన ధర్మేంద్ర తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఆలయ పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా సభ్యులు ఉదయాన్నే ఆలయానికి చేరుకుని చుట్టూ పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వనసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

కోతి దాడిలో బాలుడికి తీవ్ర గాయం

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రాజుచెరువు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఆలయం నుంచి వస్తున్న శరగడం సతీశ్ కుమార్ కుమారుడు ధనుంజయకుమార్(7)పై కోతి దాడి చేసి గాయపరచింది. కాలి కింది పిక్క భాగాన్ని కోతి కరవడంతో తీవ్రగాయమై రక్తసిక్తమైంది. స్థానికులు చూసి కోతిని చెదరగొట్టడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పింది. భూలోకమ్మ ఆలయం సమీపంలో గల గృహ సముదాయాల్లో నివసిస్తున్న చీపురపల్లి దేవుడు సక్రమ పద్ధతిలో కుక్కలు, కోతులు, పిల్లులు పెంచకపోవడంతో ప్రజలు భీతిల్లుతున్నారని, తన కుమారుడిపై కోతి దాడి చేయడానికి నిర్వహణ లోపమే కారణమని బాలుడి తండ్రి శరగడం సతీశ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అతడి ఇంటిలో ఉండే జంతుజీవాలు జనావాసాలపై దూసుకుని వస్తున్నాయని పోలీసుల ఎదుట స్థానికులు వాపోయారు. చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి హామీ ఇచ్చారు.

పోలీసుల అదుపులో పెట్రోల్ చోరులు



గోపాలపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్న కొందరు యువకుల్ని గోపాలపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎల్లపువానిపాలెం, భగత్ సింగ్ నగర్, చంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో ఇటీవల వాహనాల నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్న ముఠాలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. అర్ధరాత్రి వేళ కొందరు యువకులు ద్విచక్ర వాహనాల పెట్రోల్ లాక్ విరగ్గొట్టి పెట్రోల్ చోరీ చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో భగత్ సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కొందరు యువకులు ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్న దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఈ వీడియో వైరల్ కావడంతో ఈ యువకుల్ని గుర్తించి పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ప్రహ్లాదపురంలో నేడు శంకుస్థాపనలు

వేపగుంట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలో రూ.కోటిన్నరతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఉదయం 9 గంటలకు మేయర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపనలు చేస్తారని కార్పొరేటర్ రాపర్తి కన్నా తెలిపారు. ముఖ్య అతిథిగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు విచ్చేస్తారని పేర్కొన్నారు.

ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ సమాజ సేవలో మమేకమైనవారు ఆదర్శనీయులని ప్రముఖ న్యాయవాది కె.రామజోగేశ్వరరావు అన్నారు. ఎన్.ఎ.డి.జంక్షన్ కాకానీనగర్ కేటీబీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు, అధికారులు కలిసి ప్రజల సమస్యలు పరిష్కరించటమే కాకుండా సమాజ సేవ చేయటం అభినందనీయమన్నారు. సేవచేసిన ఉద్యోగులకు శాశ్వత కార్డులు అందజేశారు. రామజోగేశ్వరరావును సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కేటీబీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ యూనియన్ నేత మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన సంపతరావు శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం సుజాతనగర్‌లోని సీ2 జోన్ పార్క్ వెంకటాద్రినగర్‌లో నిర్వహించారు. శ్రీనివాసరావు దంపతులను శాలువతో మంత్రి రాజశేఖర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

సత్యసాయి శతవార్షికోత్సవాలు

పెందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి శతవార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆటోలకు సత్యసాయి చిత్రపటాన్ని అతికించి డ్రైవర్లకు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కొత్తవలస దరి కొత్తసుంకరపాలెం అనాథాశ్రమంలో రగ్గులు పంపిణీ చేశారు,

సత్ప్రవర్తనతో మెలగకపోతే చర్యలు

మల్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్ప్రవర్తనతో నడుచుకోకపోతే క్షమించేది లేదని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం మల్కాపురం పోలీసుస్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లను నిలబెట్టి క్లాస్ తీసుకున్నారు. ఎక్కడైనా గొడవలలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉండరాదని అన్నారు. ఒక వేళ ఉన్నట్టు తెలిస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. రోజురోజుకు ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.